క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, కామర్స్-1, పొలిటికల్ సైన్స్ (రాజనీతి శాస్త్రంలో)-1 పోస్టులకు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా కళాశాలలో సమర్పించాలన్నారు. ఈ నెల 11వ తేదీన కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు. ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీలతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులను కాలేజీలో అందించాలని సూచించారు.

కార్పొరేషన్ చైర్మన్లకు అభినందనలు..

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన పోదెం వీరయ్య, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నూతి శ్రీకాంత్‌గౌడ్, నూతగాని సత్యనారాయణలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఐదుగురికి పదవులు ఇచ్చేందుకు సహకరించిన జిల్లా మంత్రులకు ధన్యవాదాలు చెప్పారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు వాటంతట అవే వస్తాయన్నారు.

న్యాయం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: తనకు రుణం ఇప్పిస్తానని నమ్మబలికి, తన వద్ద ఉన్న ఇంటి పట్టాను తీసుకుని తనకు తెలియకుండా అమ్ముకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మంకు చెందిన బాధితురాలు జంగం పద్మ అధికారులకు విజ్ఞప్తి చేసింది. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్, ఎమ్మార్వో, పెద్ద మనుషులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా.. తనకు తగిన న్యాయం జరగలేదని ఆరోపించింది.

గణేశ్వరం పాఠశాలలో వన మహోత్సవం

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గణేశ్వరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరివేపాకు, పండ్ల మొక్కలు నాటినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లేడిబోయిన గోపాలరావు, కె.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సిబ్బంది సోమలీ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

‘త్రివేణి’లో ఎల్లో కలర్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు సోమవారం ఎల్లో కలర్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా చిన్నారులు పసుపు రంగు దుస్తులు ధరించి పాఠశాలకు హాజరై పసుపు రంగులో ఉండే ఆహార పదార్థాలతో ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించి పలు ప్రదర్శనలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, శ్రీ దేవి, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘సర్వజ్ఞ’లో రెడ్ అండ్ ఎల్లో డే



వేడుకలో పాల్గొన్న డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో రెడ్ అండ్ ఎల్లో కలర్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఎరుపు, పసుపు దుస్తులు ధరించి పాఠశాల ఆవరణమంతా బెలూన్లతో అందరినీ ఆకట్టుకున్నారు.

నారుమడి పెంపకంలో మెలకువలు పాటించాలి

కామేపల్లి: మిరప నారుమడి పెంపకంలో రైతులు మెలకువలు పాటించాలని ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని కొండాయిగూడెం రెవెన్యూ పరిధిలో పత్తి పంటతో పాటు వరి, మిరప నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ షేక్ మున్నీ, రైతులు పాల్గొన్నారు.

జన హృదయ నేత వైఎస్సార్

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వారి అభ్యున్నతికి కృషి చేసిన జన హృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. తర్వాత అనాథాశ్రమాలు, ఆస్పత్రుల్లో పండ్లు, రొట్టెలు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తుమ్మా అప్పిరెడ్డి, తదితరులు



కామేపల్లి: జాస్తిపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్కినేని సుధీర్



ఖమ్మంవన్‌టౌన్: 50వ డివిజన్‌లో పూలమాల వేస్తున్న కార్పొరేటర్ రాపర్తి శరత్, తదితరులు



రఘునాథపాలెం: కేక్ కట్ చేస్తున్న నాయకులు, వైఎస్సార్ అభిమానులు



నేలకొండపల్లి: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖమ్మంరూరల్: తల్లంపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఫిర్యాదులు పునరావృతం కానివ్వొద్దు



ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజావాణిలో వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతిపత్రాలను స్వీకరించారు.ఈ నేపథ్యాన రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫిర్యాదును ఇవ్వడానికి సీనియర్ సిటిజన్ వాకర్ సహాయంతో వస్తుండగా.. గమనించిన కమిషనర్ అతని దగ్గరకు వెళ్లి దరఖాస్తు స్వీకరించి సమస్యను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇక నుంచి ఒకసారి వచ్చిన ఫిర్యాదు మళ్లీ పునరావృతం కాకుండా వారం రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, ఇతర అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వన మహోత్సవం, ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు, ప్రజాపాలన సహాయక కేంద్రాలు, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెటింగ్, మహిళా శక్తి, ఓపెన్ ప్లాట్లు, స్థలాల సంరక్షణ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, సీజనల్ వ్యాధులు, పాత బిల్డింగ్‌లపై తీసుకుంటున్న చర్యలు, జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు అంశాలపై విధిగా నిర్వర్తించాలని ఆదేశించారు. డివిజన్లలో డ్రైడే, ఫ్రైడే ప్రోగ్రాం తప్పనిసరిగా చేయలని, ఏమైనా ఫాగింగ్ మిషన్లు మరమ్మతులకు గురైతే వాటిని బాగు చేయించి.. ఫాగింగ్ చేయాలని ఆదేశించారు.

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాడం ఆడకుండా ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నిరుద్యోగ నాయకులు రమేష్ కొండలరావు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 12 ఏళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు కేవలం 45 రోజులు గడువు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి కుదరదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీను, మహేందర్, డీఎస్సీ అభ్యర్థులు మమత, రాకేష్ ,శ్రీనివాస్, అమర్‌నాథ్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు ‘గ్యారంటీ’లు అమలు చేయాలి

నేలకొండపల్లి: ఎన్నికల సమయాన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు రూ.15 వేలు ఆర్థిక సహకారం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రధానమంత్రి పంటల భీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మన్నె రాధాకృష్ణ, మండల కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, ఇస్లావత్ నాగేశ్వరరావు, బాజా రామకృష్ణ, డి.వీరునాయక్, సయ్యద్ మోహినుద్దీన్, అడపాల శ్రీనివాస్, పిట్టల సూరిబాబు, కాళంగి వెంకటేశ్వర్లు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ఖమ్మంక్రైం: ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు శ్రద్ధాంజలి ఘటించాక ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సంఘం నాయకులు రాధాకృష్ణమూర్తి, రుద్రవెంకటనారాయణ, హుస్సేన్, సోమయ్య, సంజీవరావు, నాగేశ్వరరావు, రంగారవు, జయకర్ బాబు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీనివాస్ మరణానికి కారకుడైన సీఐను సస్పెండ్ చేయాలని పూలే అంబేడ్కర్ అధ్యయనవేదిక డిమాండ్ చేసింది. సోమవారం రాత్రి ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట స్వేరోస్ నెట్‌వర్క్, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా కమిటీ, వీరనారి సావిత్రిబాయి పూలే సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తులతో ఎస్సైకు నివాళుల ర్పించారు. నాగరాజు, రాంబాబు, దేవి, వెంకటేశ్వర్లు, విజయకుమార్, నాగేశ్వరరావు, కిరణ్, కృష్ణారావు, సురేష్, దినేష్, రమ్య, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: గతంలో ధరణిలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ చేసి నిజమైన భూహక్కుదారులను గుర్తించి, మిగులు భూములను అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఏఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యాన సోమవారం తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి వద్ద నుంచి భూములను వెనక్కి తీసుకొని వాటిలో ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక అర్హులైన నిరుపేదలను గుర్తించి అట్టి భూములను పంపిణీ చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు మట్టె నాగేశ్వరరావు, కార్యదర్శి కొమ్ము పూలే, నాయకులు పాలేపొంగు మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో తమ విద్యార్థిని జె.అవంతిక సింగిల్, డబుల్స్‌లో అండర్-15 విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థినిని ఆయన అభినందించి మాట్లాడుతూ.. ఈ నెల 15న మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వంలో మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమ్మెకు సంఘీభావం ప్రకటించిన కాంగ్రెస్ నేతలు జీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులకు గ్రామపంచాయతీల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం నుంచి వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమస్యల సాధన కోసం ఈ నెల 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.నరేందర్‌రెడ్డి, వేల్పుల రాంబాబు, రామయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అద్దం ఏర్పాటు

కామేపల్లి: —]1$ y l, Z ముచ్చర్లలో గల మూలమలుపు వద్ద వాహనదారుల ఉపయోగార్థం రూ.10 వేల విలువైన అద్దాన్ని ఏర్పాటు చేశారు. మూలమలుపు వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో గ్రామానికి చెందిన నర్సింగుల రాజేష్ అద్దాన్ని ఏర్పాటు చేయించాడు.

లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీదేవి

నేలకొండపల్లి: ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వనమహోత్సవంలో మొక్కలు నాటాలని డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీదేవి సూచించారు. మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి, చెన్నారం పంచాయతీల్లో సిద్ధం చేసిన మొక్కలు, ప్లాంటేషన్లను సోమవారం పరిశీలించిన ఆమె మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటేలా స్థలాలు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఏఓ అరుణకుమారి, ఈసీ శేషగిరిరావు, టీఏలు శైలజ, యాకయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఆఫీసర్ సేవలు మరువలేనివి



మస్తాన్‌ను సత్కరిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఆఫీసర్ మస్తాన్(హెచ్‌సీ-595) సేవలు మరువలేనివని సీపీ సునీల్‌దత్ అన్నారు. సోమవారం సీపీ కార్యాలయంలో మస్తాన్‌ను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రిటైర్‌మెంట్ వృత్తికే కాని, వ్యక్తిత్వానికి కాదని, మస్తాన్ కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, హోంగార్డు ఆర్‌ఐ సురేష్, హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం నాయకులు రఫీ, నాగరాజు, రవి పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

కామేపల్లి: గరిడేపల్లి ప్రభుత్వ పాఠశాలలో గత 12 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల బదిలీపై ఖమ్మం అర్బన్ మండలానికి వెళ్లిన గుడిపూడి శ్రీనివాసరావుకు సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేర్చడంలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మంగమ్మ, రాంజీ, రాజేష్, ప్రసాద్, ఉపాధ్యాయులు దేవాసింగ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన న్యాయవాదుల దీక్షలు

ఖమ్మంలీగల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఖమ్మంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం ఆరో రోజుకు చేరాయి. దీక్షలో మారగాని శ్రీనివాసరావు, పఠాన్ అమీర్‌ఖాన్, మీసాల వెంకటేశ్వర్లు, ముమ్మడి సతీష్, ఉబ్బలపల్లి నిరోషా దీక్షలో కూర్చోగా.. వీరికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్.రెడ్డి, వి.కృష్ణమూర్తి, వి.లక్ష్మీనారాయణ, బి.తిరుమలరావు, విప్లవ్‌కుమార్, కె.రాజశేఖర్‌రెడ్డి, వై.శ్రీనివాసరావు, టెంకటి వెంకటేశ్వర్లు, జక్కంపూడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది అరెస్టుపై నిరసన..

భద్రాచలంలో ఓ న్యాయవాదిని పోలీసులు అరెస్టు చేసి, బేడీలు వేసి కోర్టులో ప్రవేశపెట్టడంపై ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈమేరకు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్‌తో పాటు ఏడునూతల శ్రీనివాసరావు, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, బిచ్చాల తిరుమలరావు, సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వట్లేదని రహదారికి గండ్లు..

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతుండగా.. గ్రామానికి చెందిన గుగులోత్ నాగేశ్వరరావు అనే రైతు ఆ ప్రాంతానికి చెందిన రైతులను సంఘటితం చేసి రోడ్డు వేసేందుకు నిర్ణయించారు. అందుకు నాగేశ్వరరావు బాధ్యత తీసుకుని గత ఐదేళ్ల క్రితం రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి రహదారిని ఏర్పాటు చేశాడు. ఇందులో తన భార్య పుస్తెల తాడు, పట్టాదారు పాస్ పుస్తకాలను తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులు పెట్టగా.. కొంతమంది రైతులు వారి వాటా ధనాన్ని అందించారు. ఇంకా సదరు రైతుకు దాదాపు రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది. కాగా, తాను అప్పు తెచ్చి రోడ్డు వేయగా.. అప్పు ఇచ్చిన వారు వేధిస్తుండడంతో తన 10 కుంటల భూమిని అమ్మి అప్పులు చెల్లించాడాట. దీంతో ఆగ్రహించిన బాధిత రైతు సోమవారం తాను వేయించిన రోడ్డుపై రాకపోకలు జరగకుండా జేసీబీతో 10 చోట్ల గండ్లు పెట్టించాడు. తమకు న్యాయం చేసే వరకు రహదారి నుంచి రాకపోకలు చేయనీయని అని నిరసన వ్యక్తం చేశాడు.

రాజకీయ జోక్యంతోనే రైతుల ఆత్మహత్యలు

ఖమ్మంమయూరిసెంటర్: భూ వివాదాల్లో రాజకీయ జోక్యంతోనే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గద్దని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ జోక్యంతో భూ సమస్యలు జటిలమవుతున్నాయని, రైతులు భూ కబ్జాదారులను ఎదురించే శక్తిలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి పెరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలపై రెండు వైపులా వాస్తవ పరిస్థితులు సమగ్రంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అందుకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా సాగుదారులకు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఏ షరతులను లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపుజేయాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.మీరా, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బిక్కసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-1 ప్రిలిమ్స్‌లో అర్హత

నేలకొండపల్లి: ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన బొడ్డు సంతోష్ గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించారు. కాగా, గ్రామంలోని సామాన్య రైతు కుటుంబానికి చెందిన సంతోష్ తన మొదటి ప్రయత్నంలోనే అర్హత సాధించడం విశేషం.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న బైపాస్ రోడ్ 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 సెక్షన్ ఏఈ బితావుర్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బైపాస్ రోడ్, బ్యాంక్‌కాలనీ, వేణుగోపాల్ నగర్, ప్రశాంతినగర్, విజయనగర్ కాలనీ, వీడీఓస్ కాలనీ, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కాలేజీ ఎదురు ప్రాంతం, రస్తోగి నగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ కోత విధించబడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని బైక్‌పై వచ్చిన వ్యక్తి ఢీకొట్టాడు. నేలకొండపల్లికి చెందిన బిక్షమయ్య సోమవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టి పరారయ్యాడు. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఆటో పల్టీ కొట్టి ఇద్దరికి..

ఖమ్మంక్రైం: దానవాయిగూడెంకు చెందిన ఇద్దరు విద్యార్థులు నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ పాఠశాలలో చదువుతున్నారు. వీరు పాఠశాలకు ఆటోలో వస్తుండగా.. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వస్తూ రోడ్డును దాటుతున్నాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో పల్టీ కొట్టగా.. అందులోని ఇద్దరి విద్యార్థులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పగిడిపల్లి ఏసు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకొచ్చి పనిచేసిన కూలీలకు పనులు నమోదు కాకుండా చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానాల పేరుతో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావొస్తున్నా చేయూత పెన్షన్లు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జీరో విద్యుత్ బిల్లు, రూ.500 గ్యాస్ సబ్సిడీకి సంబంధించి ఆన్‌లైక్ కాక చాలా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు బానోతు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు పగిళ్ల వీరభద్రం, సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు, కోశాధికారి మేళ్లచెరువు వీరబాబు, ఖమ్మం రూరల్ మండలం కార్యదర్శి కె.వీరయ్య, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలను నిత్యం గమనించాలి

ఖమ్మంరూరల్: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని స్కోప్ ఆర్డి డైరెక్టర్ ఎంఎల్. ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని నాయుడుపేటలో ఎస్‌బీఐ ప్రాంగణంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో పిల్లలను సానుకూల దృక్పథంతో పెంచితేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, కె.సుజాత, చంద్రశేఖర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకై సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఎస్టీఓ కార్యాలయాన్ని కలెక్టరేట్ నుంచి ఖమ్మంకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక ఓల్డేజ్ హోంకు స్థలం కేటాయించాలని, నగదు రహిత వైద్యం అందించాలని, అడ్వాన్స్ తీసుకున్న పెన్షన్ రికవరీని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని కోరారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శర్మ, జనార్దన్, పూర్ణచంద్రరావు, చెంచురెడ్డి, మారం రాజు, రాధా కృష్ణారావు, ఖాజా మొహినుద్దిన్, రాజారావు, బసవరావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కలెక్టర్‌కు వినతి..

రఘునాథపాలెం: మండలంలోని ఎన్‌వీబంజర్ గ్రామ పంచాయతీలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మండలంలోనే మారుమూల గ్రామ పంచాయతీ అని రేషన్ షాపు లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోని పంగిడి వెళ్లి తీసుకురావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా రేషన్‌షాపు, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.